## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

**కేపీహెచ్‌బీకాలనీ:** విద్యుత్ మరమ్మతుల కారణంగా కేపీహెచ్‌బీ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ టి.విద్యాసగర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డిమార్టు ఫీడర్ పరిధిలోని రోసరీ స్కూల్, హెచ్‌ఐజీ. 2 ఫిష్ మార్కెట్, బ్లాక్ నెంబర్ 2, హెచ్‌ఐజీ 2 బ్లాక్, హెచ్‌ఐజీ 119, డిమార్ట్ రోడ్డు, హెచ్‌ఐజీ 130, ఎంఐజీ 12, ఎంఐజీ 2 బ్లాక్ లైన్ ఏబీ, హెచ్‌ఐజీ 6, వినాయక పార్కు, హెచ్‌ఐజీ 9, ప్లాట్ 1, ల్యాబ్, టెలీఫోన్ ఎక్స్ఛేంజ్, టెలిఫోన్ క్వార్టర్స్, అదే విధంగా మూసాపేట ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బ్రాండ్ ఫ్యాక్టరీ వెనుక వైపు, బతుకమ్మ కుంట, ఎంఐజీ 877, దోబీఘాట రమ్యాగ్రౌండ్, మల్లారెడ్డి డిటిఆర్, చైతన్య ఫుడ్ కోర్టు, ఎంఐజీ ఫ్లాట్స్, ఎల్ఐజీ ఫ్లాట్స్, వినాయక ఆలయం, కన్యకా పరమేశ్వరి ఆలయం, ఎల్ఐజీ ఇళ్ల ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

### కేపీహెచ్‌బీ 7వ ఫేజ్ ఫీడర్ పరిధిలో...

**మూసాపేట:** కేపీహెచ్‌బీ 7వ ఫేజు 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేపీహెచ్‌బీ 7వ ఫేజు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇందు నెక్ట్స్ అపార్టుమెంట్‌లలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

### గాయత్రినగర్ ఫీడర్ పరిధిలో..

**మోతీనగర్:** గాయత్రినగర్ ఫీడర్ పరిదిలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గాయత్రినగర్, రైల్వే ట్రాక్ దగ్గర, మెరిడియన్ స్కూల్ ప్రాంతాల్లో అదే విధంగా వివేకానందనర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వివేకానందనగర్ ప్రాంతం, ఎస్ కన్వెన్షన్, తండా రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని అల్లాపూర్ ఏఈ కె. శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు.

### 21న జంప్ రోప్ పోటీలకు ఎంపిక

**కూకట్‌పల్లి:** తెలంగాణ జంప్ రోప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి బాలుర, బాలికల ఎంపిక పోటీలు ఈ నెల 21వ తేదీ శనివారం నిర్వహించనున్నారు. కూకట్‌పల్లి నగరంలోని చిత్తారమ్మ గుడిలో జూనియర్, సబ్ జూనియర్ రాష్ట్ర జట్టు జంప్ రోప్ బాలురు, బాలికల ఎంపికలు జరుగుతాయి. ఇక్కడ ఎంపికైన జంప్ రోప్ జట్టు వచ్చే నెల ఫిబ్రవరి 2 నుంచి 5 వరకు మహారాష్ట్రలోని సాయినగర్ షిర్డిలో జరిగే జాతీయస్థాయి జంప్ రోప్ పోటీల్లో తెలంగాణ జాతీయ జంప్ జట్టు పాల్గొంటాయని తెలంగాణ జంప్ రోప్ అసోసియేషన్ సెక్రటరీ బాలరాజు తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే విద్యార్థులు ఆధార్ కార్డు, స్టడి సర్టిఫికెట్ తెచ్చుకోవాలని ఆర్గనైజ్ సెక్రటరీ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. మరిన్ని వివరాలకు 8686774084లో సంప్రదించాలి.

### సీతారామయ్యకు గోల్డ్‌మెడల్



**బాలానగర్:** ఫతేనగర్ డివిజన్ గౌతమ్‌నగర్‌కు చెందిన సీతారామయ్య ఈనెల 17న తిరుపతిలో నిర్వహించిన అథ్లెటిక్స్ విభాగంలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించారు. 60 సంవత్సరాల వయస్సులో రన్నింగ్ అండ్ షూటింగ్ చేసే విభాగంలో మెడల్ సాధించారు. గురువారం సీతారామయ్యను పలువురు కాలనీ వాసులు ఆయనను అభినందించారు.

### ప్రమాదవశాత్తు టిప్పర్ డ్రైవర్ మృతి

**కేపీహెచ్‌బీకాలనీ:** టిప్పర్ వాహనంలో నింపుకొని తీసుకువచ్చిన బండరాళ్లను కిందకు దింపే క్రమంలో ఒక బండరాయి ప్రమాదవశాత్తు జారి టిప్పర్ డ్రైవర్ జననాంగంపై పడటంతో తీవ్రంగా గాయపడిన టిప్పర్ డ్రైవర్ మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం జనగాం జిల్లాకు చెందిన గాడిపెల్లి రాజు(42) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే గురువారం ఉదయం తన టిప్పర్‌లో బండరాళ్లను లోడ్‌చేసుకొని కేపీహెచ్‌బీకాలనీ ప్రాంతంలోని ముళ్లకత్వ చెరువు వద్ద దింపేందుకు వెళ్లాడు. బండరాళ్లను కిందకు దింపే క్రమంలో టిప్పర్ వెనుక తలుపును తెరిచేందుకు యత్నిస్తుండగా ఒక్కసారిగా బండరాయి కిందకు జారి డ్రైవర్ రాజు జననాంగంపై పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన రాజు మృతి చెందాడు. ఈమేరకు మృతుడి భార్య హైమ ఇచ్చిన ఫిర్యాదుతో కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### అన్నదానం

**మూసాపేట:** మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులోని సంకటమోచన హనుమాన్ ఆలయంలో గురువారం మోహన్‌దాస్ బాబాజీ భగవద్గీత పారాయణం నిర్వహించారు. అనంతరం బీజేపీ నాయకులు పండగ గోపి నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కొడిచేర్ల మహేందర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శివరాజ్, జానకి, ఈ, సాయి, ఎరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కంటి పరీక్షలు షురూ..

### రెండో విడత



కంటి పరీక్షల తీరును పరిశీలిస్తున్న బాలాజీ నగర్ కార్పొరేటర్ పగుడాల శిరీషబాబూరావు

### కంటి వెలుగు



మూసాపేటలో కంటి పరీక్షల తీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యింది. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కేపీహెచ్‌బీకాలనీ, మూసాపేట, బోయినపల్లి డివిజన్లలోని కంటి వెలుగు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు కంటి సమస్యలతో బాధపడొద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. పీజేఆర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ గురువారం స్థానిక కార్పొరేటర్ దొడ్లవెంకటేష్ గౌడ్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యంగా 50 సంతవత్సరాలు పై బడిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అదే విధంగా నియోజకవర్గాల్లోని డివిజన్ల కార్పొరేటర్లు తమ పరిధిలోని కేంద్రాలను సందర్శించి పరీక్షల తీరును పరిశీలించారు. కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించి పరీక్షల కోసం వచ్చిన ప్రజలతో మాట్లాడారు.

– కూకట్‌పల్లి జోన్ బృందం

**మొదటిరోజు 1039 మందికి పరీక్షలు**

కూకట్‌పల్లి నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం మొత్తం 18 కంటి వెలుగు కేంద్రాల్లో 1039 మందికి కంటి పరీక్షలు చేశారు. అందులో 406 మందికి కళ్లద్దాలు అందజేశారు. కంటి చికిత్సలకు 190 మందిని రిఫర్ చేసినట్లు బాలానగర్ పీహెచ్‌సీ వైద్యుడు చందర్ తెలిపారు.



వెంకటేశ్వరనగర్‌లో.. కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు



కంటి వెలుగు కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి



కళ్లద్దాలు అందజేస్తున్న హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు



రాజీవ్‌గాంధీనగర్‌లో కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సబిహాబేగం



పీజేఆర్‌నగర్‌లో ప్రజలకు కళ్లద్దాలు అందజేస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



కూకట్‌పల్లి డివిజన్‌లో వైద్యులు ఇచ్చిన పత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ



గంగపుత్ర సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## మోచేతి కేన్సర్‌తో వచ్చిన యువకుడికి కొత్త జీవితం

- విజయవంతంగా శస్త్ర చికిత్స చేసిన అమోర్ ఆస్పత్రి వైద్యులు
- స్వదేశీ 3డీ ప్రింటెడ్ ఎముకలను అమర్చిన వైనం
- పూర్తి స్థాయిలో తిరిగొచ్చిన చెయ్యి



**కూకట్‌పల్లి:** మోచేతిలో కేన్సర్ రావడంతో దాదాపుగా చెయ్యి కోల్పోవాల్సి వచ్చిన ఓ యువకుడికి 3డి ప్రింటెడ్ ఎముకలను అమర్చి, చేతిని పూర్తిస్థాయిలో పునరుద్ధరించడం ద్వారా అతడికి అమోర్ ఆస్పత్రి వైద్యులు కొత్త జీవితాన్ని ప్రసాదించారు. ప్రముఖ ఆర్థో అంకాలజిస్టు డాక్టర్ కిశోర్ బి.రెడ్డి చికిత్స వివరాలను తెలిపారు. సంగారెడ్డి ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల యువకుడికి మోచేతికి బోన్ కేన్సర్ వచ్చింది. బయాప్సీ చేసి నిర్ధారించిన తర్వాత అతడికి ముందుగా కీమోథెరఫీ చేసి తర్వాత శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించారు. రోగి కొలతలతోనే వాళ్లకు సరిగ్గా సరిపోయే కృత్రిమ ఎముకలను అమర్చడం వల్ల చెయ్యి పూర్తిగా తిరిగొస్తుందని భావించారు.

◆ ఇప్పుడు భారతదేశంలోనే ఇలాంటివి 3డి ప్రింటెడ్ ఎముకలు దొరుకుతున్నాయి. దాంతో ముందుగా ఆ యువకుడి చేతికి సిటీస్కాన్ తీసి బయో మెడికల్ ఇంజినీర్‌కు పంపించి చేతి కొలతకు తగ్గట్లుగా రేడియల్ ఎముక ప్లాస్టిక్ నమూనాను పంపారు. దీంతో డిజైన్ అంతా సరిపోయిందని నిర్ధారించిన తర్వాత 3డి ప్రింటెడ్ ఎముకను పంపారు. దీంతో శస్త్ర చికిత్స చేయగా అతని చేయి పూర్తిగా తిరిగొచ్చిందని వైద్యులు తెలిపారు. ఇప్పుడు మోచేయి, మణికట్టు పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయని వైద్యులు తెలిపారు.

◆ ఈ సందర్భంగా డాక్టర్ కిశోర్ బి. రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో ఆర్థోపెడిక్ సమస్యలన్నిటికి ఈ విధంగా 3డి ప్రింటెడ్ పరికరాలు వస్తాయన్నారు. ప్లేట్లు, స్క్రూలు అన్ని రోగి కొలతలకు తగినట్లుగానే తయారు చేస్తారని, వీటితో తక్కువ సమయంలోనే కోలుకోవడానికి వీలుంటుందని తెలిపారు.

## డివిజన్ల వారీగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి

**నిజాంపేట్:** ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సమస్యలను పరిష్కరించేకు కృషి చేస్తున్నామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట్ కార్పొరేషన్ 13వ డివిజన్ శ్రీనివాస హౌసింగ్ సొసైటీలో చేపట్టనున్న రోడ్ ప్యాచ్ వర్క్, భూగర్భ డ్రైనేజీ పనులను ఆమె డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, స్థానిక కార్పొరేటర్ ఆవుల పావనితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. డివిజన్ల వారీగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. త్వరితగతిన వాటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాజేశ్వరి, సురేష్ రెడ్డి, బాలాజీనాయక్, బీఆర్ఎస్ నాయకులు ఆవుల జగన్‌యాదవ్, వెంగయ్యచౌదరి, నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి నాగరాజ్ యాదవ్, బీసీసెల్ ప్రెసిడెంట్ తలారి సాయిముదిరాజ్, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

## ఫుట్‌పాత్ రీడిజైనింగ్‌కు చర్యలు చేపట్టండి

ఎమ్మెల్యే వివేకానంద్

**రంగారెడ్డినగర్:** రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఐడీపీఎల్ జంక్షన్ అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లతో ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం కలుగుతుందని ట్రాఫిక్, లాఅండ్‌ఆర్డర్ పోలీసులు అభ్యంతరం వెల్లుబుచ్చిన నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే వివేకానంద్ స్థానిక కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్‌తో కలిసి ఐడీపీఎల్‌ను జంక్షన్‌ను సందర్శించారు. ఐడీపీఎల్ జంక్షన్‌లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కమర్షియల్ షటర్లను ఏర్పాటు చేసేందుకు ఫుట్‌పాత్‌లను మరింత వెడల్పు చేశారు. అయితే దీంతో జంక్షన్ వెడల్పు అయినా రోడ్డు మాత్రం కుంచించుకుపోయింది. దీంతో భవిష్యత్‌లో తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని, సిగ్నల్ పడితే ఫ్రీ లెఫ్ట్ తీసుకునేందుకు వీలు లేకుండా ఉందని ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి, బాలానగర్ లా అండ్ ఆర్డర్ ఏసీపీ గంగారామ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికలు సిద్ధం చేసి ఫుట్‌పాత్ రీడిజైనింగ్‌కు చర్యలు చేపట్టాల్సిందిగా ఎస్ఈ చెన్నారెడ్డి, ఈఈ గోవర్ధన్‌గౌడ్‌లను ఆదేశించారు. డీఈఈ రూపాదేవి, సీఐలు భాస్కర్, నరహరి, చంద్రశేఖర్, కన్సల్టెంట్ పూజిత, ఏఈ సంపత్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య తదితరులు ఉన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే నేరాలు నియంత్రణ సాధ్యం

మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి



కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాలనీలో పర్యటిస్తున్న మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి

**కేపీహెచ్‌బీకాలనీ:** నేరాల నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని.. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. గురువారం ఆమె కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో పర్యటించి నేరాలు జరగడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువగా చోరీలు జరిగే హౌసింగ్‌బోర్డు కాలనీతో పాటు ధర్మారెడ్డి కాలనీ, అడ్డగుట్ట సొసైటీ, హైదర్‌నగర్, వసంత్‌నగర్ తదితర కాలనీల్లో ఆమె క్రైం డీసీపీ నర్సింహారెడ్డి, సీఐ కిషన్‌కుమార్‌లతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లపై ఇష్టారాజ్యంగా పార్కు చేస్తున్న ద్విచక్ర వాహనాల చోరీకి గురికాకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. హాస్టల్స్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో పార్కింగ్ సదుపాయం లేకపోవటంతో రోడ్లపైనే వాహనాలను పార్కు చేస్తుండగా రాత్రి వేళల్లో చోరీలకు గురవుతున్నాయనే విషయమై హాస్టల్స్ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

◆ ప్రత్యేకంగా పార్కింగ్ ప్రాంతాన్ని ఏర్పాటు చేసుకొని అందులో వాహనాలను నిలుపుకోవటంతో పాటు సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకోవాలన్నారు. నేరాలు చోటు చేసుకున్న సత్వరం నేరగాళ్లను పట్టుకునేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీసుల సూచనలను పాటించటంతో పాటు స్వతహాగా కూడా హాస్టల్ నిర్వాహకులు, వ్యాపారస్తులు భద్రతా చర్యలను తీసుకోవాలని ఆమె కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల నియంత్రణ సాధ్యమని ఆ దిశగా కాలనీల ప్రజలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పటిష్టమైన చర్యలను చేపట్టాలని కోరారు. నేరుగా డీసీపీ స్థాయి అధికారిణి ప్రజల వద్దకు వచ్చి నేరాల నియంత్రణ పట్ల ప్రజల నుంచి సూచనలు తీసుకోవటం పట్ల స్థానికులు హర్షం వెలిబుచ్చారు.



హాస్టల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న డీసీపీ

## కార్మికులను పర్మినెంట్ చేసే వరకు పోరాడతాం



**రంగారెడ్డినగర్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాల అవలంభిస్తూ వారి హక్కులను కాలరాస్తున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసూఫ్, కార్యదర్శి బాలరాజు అన్నారు. గురువారం మేడ్చల్ జిల్లా సమితి సమావేశం ఐడీఏ జీడిమెట్లలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కె.స్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాలతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. చట్ట సభల్లో కార్మిక సమస్యలను ప్రస్తావించే ప్రతినిధులను పంపాల్సిన అవసరం ఉందన్నారు.

◆ రానురాను కాంట్రాక్ట్ విధానంలో పనిచేసే కార్మికుల సంఖ్య పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్మినెంట్ ఉద్యోగాలు కనుమరుగై కార్మికులు తమ హక్కులను పూర్తి కోల్పోతున్నారని పేర్కొన్నారు. కార్మికులందరిని పర్మినెంట్ చేసే విధంగా పోరాటాలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేల వేతనం అమలు చేసేలా ప్రభుత్వాలు జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

◆ ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసురత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిచంద్ర, జిల్లా కార్యదర్శి జయచంద్ర, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉమామహేష్, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి మహేందర్, ఉపాధ్యక్షుడు హరినాథ్, మున్సిపల్ అధ్యక్ష, కార్యదర్శులు రాములు, శేఖర్, బాచుపల్లి మండల కార్యదర్శి కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, పరమేశ్వర, నగప్ప, సాయులు, తులసి, సుంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## ఉపాధ్యాయుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

కేలండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ కవిత



**కూకట్‌పల్లి:** ఉపాధ్యాయుల చైతన్యంతోనే విద్యార్థుల భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ సేవలు అభినందనీయమని ఆమె అన్నారు. తమ ప్రభుత్వం ఉపాధ్యాయుల సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. గురువారం ఆమె క్యాంపు కార్యాలయంలో పండిత పరిషత్ కేలండర్‌ను ఆమె ఆవిష్కరించారు. తెలుగు, హిందీ, ఉర్దూ పండిత్‌లు భాషా బోధన ద్వారా విద్యార్థులను సృజనశీలురుగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పుడ్స్ చైర్మన్ మేడె రాజీవ్‌సాగర్, ఆర్‌యూపీపీటీ అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి గుల్లపల్లి తరుమల కాంతి క్రిష్ణ, కోశాధికారి వీఎస్ఎస్‌సీఎస్ శర్మ, అసోసియేట్ అధ్యక్షుడు ఘనపురం దేవేందర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల సుడిగుండంలో ఇంద్రాహిల్స్

**భాగ్యనగర్‌కాలనీ:** రెక్కాడితే గానీ డొక్కాడని పేద ప్రజలే ఆ కాలనీలో అధికంగా నివాసం ఉంటారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కాలనీపై చిన్న చూపు చూడటంతో కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఆల్విన్‌కాలనీ డివిజన్ ఇంద్రా హిల్స్ కాలనీలో పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రోడ్లు వంటి సమస్యలతోనే కాలనీ వాసులు సహజీవనం చేయాల్సిన దుస్థితి నెలకొంది. కాలనీ ఏర్పడి మూడు దశాబ్దాలు గడుస్తున్నా... నగరం ఓ వైపు వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికి హైటెక్ సిటీకి కూతవేటు దూరంలో ఉన్న ఇంద్రాహిల్స్ కాలనీ నేటికి సమస్యల నడుమే కొట్టుమిట్టాడుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు మారుతున్నా తమ కాలనీ తలరాత మాత్రం మారటం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంద్రాహిల్స్ శివాలయం చౌరస్తాలో ఎన్నో ఏళ్లుగా రోడ్డుపై గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. ఈ కాలనీకి ప్రధాన చౌరస్తా కావటంతో ఇప్పటికి ఎటువంటి రోడ్డు నిర్మాణం చేపట్టకపోవటంతో గుంతల రోడ్లపైనే కాలనీ వాసులు, వాహనదారులు, పాదాచారులు రాకపోకలు సాగిస్తున్నారు.

### అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ...

ఇంద్రాహిల్స్ కాలనీలో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లటంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించటంతో వాహనదారులతో పాటు సమీపంలోని శివాలయానికి వచ్చే భక్తులు దుర్గంధం, దుర్వాసన భరించలేక ఆలయానికి వచ్చేందుకు కూడా వెనుకంజ వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే స్థానిక వాహనదారులు భరించలేని దుర్గంధం మధ్య రాకపోకలు కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది. మురుగు రోడ్లపై ఏర్పడిన గుంతల్లో చేరి వాహనాల రాకపోకలతో ఇతరులపై చింది పడటంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మురుగునీటిపై రాకపోకలు సాగించాలంటే పాఠశాల విద్యార్థులు, పాదాచారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



మ్యాన్‌హోల్ నుంచి ఏరులై పారుతున్న మురుగు




ఇంద్రాహిల్స్ కాలనీ ప్రధాన చౌరస్తాలో..

### పడకేసిన పారిశుద్ధ్యం...

కాలనీలో ఎక్కడ చూసినా రోడ్లు అధ్వానంగా మారటంతో పాటు రోడ్లకు ఇరువైపులా చెత్తా చెదారంతో పాటు మురుగు కాల్వలో నుంచి తీసిన మట్టికుప్పలు దర్శనమిస్తున్నాయి. నెలల తరబడి రోడ్లపై చెత్తా చెదారం ఉన్నప్పటికి వాటిని తరలించటం లేదు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలియజేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా తమ కాలనీలో క్షేత్ర స్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పర్యటించి కాలనీలో ఉన్న సమస్యలు తీర్చి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

**మా కాలనీని పట్టించుకోవటం లేదు..**



ఆల్విన్‌కాలనీ డివిజన్ ఇంద్రా హిల్స్ కాలనీలో నిత్యం సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. చుట్టు పక్కల కాలనీలో వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికి ఇంద్రాహిల్స్‌లో అధికంగా పేదలు నివసించటంతో మా కాలనీని ఎవరూ పట్టించుకోవటం లేదు. దీంతో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలు రోజు రోజుకు అధికమవుతున్నాయి. అధికారులు కాలనీలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలి. సామాన్య, మధ్య తరగతి నివసించే కాలనీలపై దృష్టి సారించి అభివృద్ధి చేయాలి.

–జే.భీమ్‌రావు, ఇంద్రాహిల్స్


## కళలను ఆస్వాదిద్దాం.. కళాకారులను ఆదుకుందాం



సురభి రమేష్‌రావును సన్మానిస్తున్న రాము

**కూకట్‌పల్లి:** భరతమాత ముద్దుబిడ్డ సర్దార్ వల్లభాయ్ పటేల్ జ్ఞాపకార్థం జరిగిన కార్యక్రమంలో సురభి రమేషరావును ప్రముఖ రంగస్థల నటుడు, నంది అవార్డు గ్రహీత టి. రాముచే గురువారం బంగారు పతకం, శాలువ, మెమొంటోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం కూకట్‌పల్లిలోని భారత్‌వికాస్ కళా పరిషత్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా సురభి రమేష్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కళలను ఆస్వాదించి, పేద కళాకారులను ఆదుకోవాలని కోరారు.

## నాలెడ్జ్ టెస్ట్‌లో శ్రీచైతన్య విజయకేతనం



**కేపీహెచ్‌బీకాలనీ:** కూకట్‌పల్లి బాలాజీనగర్ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు క్యాట్ ఒలింపియాడ్ పరీక్షలో 157 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిలో 148 మందికి మెరిట్ సర్టిఫికెట్‌లు, 136 మందికి పతకాలు, 54 వేల రూపాయల బహుమానం గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఏజీఎం శివరామకృష్ణ, ఆర్ఐ పద్మజ, ప్రిన్సిపల్ సునీల, జోనల్ కో–ఆర్డినేటర్ మురళీకృష్ణ, డీన్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462
9705444132